బడుగుల ఇళ్ల నిర్మాణాలకు బ్రేకులు



దేవరాపల్లి జగనన్న లేఅవుట్‌లో బిల్లులు చెల్లించక పోవడంతో నిలిచి పోయిన ఇళ్ల నిర్మాణాలు

- బిల్లుల చెల్లింపులో జాప్యం
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న జగనన్న కాలనీల్లో ఇళ్లు
- బిల్లులు మంజూరుపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- కూటమి ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల్లో అసంతృప్తి

అసంపూర్తిగా దర్శనమిస్తున్న పక్కా ఇళ్లు



దేవరాపల్లి: పేదల ఇళ్ల నిర్మాణాల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పక్కా గృహాల బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తుండడంతో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో పేదల సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్లలో శరవేగంగా జరిగిన ఇళ్ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రేకులు పడ్డాయి. దీంతో లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణం చేపట్టిన ఇళ్లకు నెలల తరబడి బిల్లులు చెల్లించక పోవడంతో పనులకు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.పలువురు ఇప్పటికే అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలు చెల్లించలేక, నిర్మాణాలు ముందుకు సాగక తీవ్ర వేదనకు గురవుతున్నారు. బిల్లుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు సైతం స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలను నిలిపి వేశారు. దీంతో మండల వ్యాప్తంగా లేఅవుట్లలో ఇళ్లన్నీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలందిరికీ పక్కా ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో జగనన్న లేఅవుట్లలో స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేశారు. లేఅవుట్లలో విద్యుత్, నీటి సదుపాయం కల్పించారు. ఇళ్లు నిర్మించిన వారందరికీ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి తారుమారైంది. తొలుత ఇసుక సమస్య వేధించగా, తాజాగా బిల్లులు అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దేవరాపల్లి మండలంలో ఇలా... దేవరాపల్లి మండలంలో 27 పంచాయతీల్లో 30 జగనన్న లేఅవుట్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1,984 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 690 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. 965 మంది ఇంకా నిర్మాణాలను మొదలు పెట్టాల్సి ఉంది. పునాది స్థాయిలో 203 ఇళ్లు, లింటల్ లెవెల్‌లో 14 ఇళ్లు, రూఫ్ లెవెల్‌లో 59 ఇళ్లు, శ్లాబ్ లెవెల్‌లో 49 ఇళ్లు ఉన్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 150 మందికి పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది.

బిల్లులు ఎప్పడిస్తారో చెప్పడం లేదు



దేవరాపల్లి లేఅవుట్లలో గత ప్రభుత్వ హయాంలో పక్కా ఇళ్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పునాది, లింటల్, శ్లాబ్ లెవెల్ వరకు బిల్లులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను చేపట్టాలని అధికారులు సూచించడంతో ప్లాస్టింగ్, ఇతర పనులు చేపట్టాం. మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయడం లేదు. హౌసింగ్ అధికారులను అడిగితే ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వడం లేదు.
–దాసరి సత్యవతి, పక్కా ఇళ్లు లబ్ధిదారు, దేవరాపల్లి

బిల్లులు రాకపోవడం వాస్తవమే



దేవరాపల్లి మండల వ్యాప్తంగా 1,984 ఇళ్లు మంజూరు చేశాం. ఇప్పటి వరకు 690 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. గత ఏడాది నవంబర్ నుంచి బిల్లులు రాకపోవడం వాస్తవమే. బిల్లులు కోసం ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
–ఎస్. భవ్యతేజ, హౌసింగ్ ఏఈ, దేవరాపల్లి.

క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న పోతిన నాగేశ్వరరావు

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన పోతిన నాగేశ్వరరావు(ఎన్‌ఆర్‌ఐ) రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఆలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు ఈ నగదును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, స్థానిక నాయకులు పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీ ముమ్మిన రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ



ముగ్గులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ భీమరాజు

నాతవరం: మండలంలో జిల్లేడుపూడిలో తీర్థం సందర్భంగా శనివారం రామాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పోటీల నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఎస్‌ఐ సీహెచ్. భీమరాజు, స్థానిక మహిళలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చని చెప్పారు.

పీహెచ్‌సీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు వైద్యాధికారి ప్రశాంతి

గొలుగొండ: స్థానిక పీహెచ్‌సీని డివిజన్ అదనపు వైద్యాధికారి, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రశాంతి శనివారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారి శ్యామ్‌ను అడిగితెలుసుకున్నారు.ఆస్పత్రిలో ప్రసవాలు సంఖ్య పెంచాలని సూచించారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు



పశుసంవర్ధకశాఖ ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 31 వరకూ గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్టు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ శిబిరాలను నిర్వహించాలని ఆయన పశువైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. వైద్య శిబిరాల్లో పశువులకు గర్భకోశ చికిత్సలు, చూడి తనిఖీలు చేయడంతో పాటు, పెయ్యిలకు నట్టల నివారణ మందులను ఇవ్వనున్నట్టు చెప్పారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో గల పశువైద్య కేంద్రాల పరిధిలో గ్రామాల్లో ఈ పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

సక్రమంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీహెచ్‌వో ప్రసాద్

గొలుగొండ: వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. కంతారం, పెనరాడ ప్రాంతాల్లో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సిబ్బంది పక్కాగా నిర్వహించాలన్నారు.

మహిళా మార్టులో సరకులు కొనకపోతే రుణాలివ్వరా ?

- వెలుగు అధికారులపై సర్పంచ్‌ల ఆగ్రహం
- డ్వాక్రా మహిళలను బెదిరిస్తున్నారని మండల సమావేశంలో మండిపాటు



ఏపీఎం మంగను నిలదీస్తున్న సర్పంచ్ వెంకటరమణ

మాకవరపాలెం: వెలుగు మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయకపోతే డ్వాక్రా సభ్యులకు రుణాలు మంజూరు చేయరా అంటూ పలువురు సర్పంచ్‌లు వెలుగు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రుత్తల లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు, పథకాల వివరాలను సభ్యులకు వివరించారు. ఈ నేపథ్యంలో వెలుగు ఏపీఎం మంగ మాట్లాడుతుండగా జడ్.గంగవరం సర్పంచ్ దుంగల వెంకటరమణతోపాటు పలువురు సర్పంచ్‌లు అడ్డుతగిలారు. వెలుగు మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయకపోతే డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చేదిలేదని బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. ఎందుకు రుణాలు ఇవ్వరో చెప్పాలని నిలదీశారు. ఒక్కో సభ్యురాలి వద్ద వసూలు చేసిన రూ.250 నగదుతో ఏం చేశారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం రుణాలు ఇవ్వాలని, సరకులు కొనలేదని రుణాలు ఇవ్వకపోతే ఊరుకునేదిలేదన్నారు. దీనిపై ఏపీఎం మంగ మాట్లాడుతూ మహిళల నగదుతో మార్ట్ పెట్టినందున అక్కడ కొనుగోలు చేయాలని చెపుతున్నామని, కొనుగోలు చేయకుంటే రుణాలు ఇవ్వమని ఎవరినీ బెదిరించలేదన్నారు. వారి ఆసక్తి మేరకే సరకులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. రేషన్ డిపోల్లో కంది పప్పు కొందరికే ఇస్తున్నారని, కార్డుదారులందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు సివిల్ సప్లై డీటీ ఈశ్వరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజారావు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

మాకవరపాలెం: లైంగిక వేధింపుల నివారణ చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సరోజిని, రమణమ్మ, రామలక్ష్మి, రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చట్టం ద్వారా అమలు చేసే శిక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల లక్ష్మి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శివనారాయణరాజుకు అభినందనలు



శివనారాయణరాజుకు అభినందనలు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: ప్రజాస్వామ్య పరిరక్షణ(ఆర్టీఐ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె.శివనారాయణరాజును పలు ప్రజాసంఘాల నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలియజేశారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు చిట్టియ్య, దాసరి నాగేశ్వరరావు తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివనారాయణరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



నర్సీపట్నం మెయిన్ స్కూల్‌లో నోటీసు బోర్డులో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కె.కోటపాడు హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



వడ్డాది పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సీపట్నం: నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్), గవర్నమెంట్ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్(తురకబడి)ల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 774 మందికి గాను 567 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో సీహెచ్.తలుపులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు.
బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షకు 162 మంది విద్యార్థులు హాజరయ్యారు. కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో బుచ్చెయ్యపేట,మాడుగుల,చీడికాడ మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాశారు.
కె.కోటపాడు : 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన నవోదయ పరీక్ష శనివారం కె.కోటపాడు హైస్కూల్‌లో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష రాసేందుకు కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన 324 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా నవోదయ పరీక్షల సూపరింటెండెంట్ పద్మావతి చర్యలను తీసుకున్నారు.
మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 173 మంది హాజరైనట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన 279 మంది విద్యార్థులకు గాను, 173 మంది హాజరైనట్టు చెప్పారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



భూ రీసర్వేపై రైతులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్



పి.బి.బి.అగ్రహారంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తెనుగుపూడి గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

నాతవరం: భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి పి.బి.బి.అగ్రహారంలో రీ సర్వేపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద పెద బైరవ భూపతి అగ్రహారం రెవెన్యూ గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసిందని తెలిపారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయర్ ప్రసాద్, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ వీఆర్వోలు బాబు, చలపతి, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
దేవరాపల్లి: ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని దేవరాపల్లి తహసీల్దార్ పి.లక్ష్మీదేవి సూచించారు. రీసర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా తెనుగుపూడిలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి, అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలపై గ్రామ సభలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.గోవిందరాజులు, స్థానిక ఉప సర్పంచ్ కాటిపాము పెదనాయుడు, మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రేవళ్లలో మురికి కాల్వ శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రాజు, అధికారులు



మంగళాపురంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



ఎంకే పట్నంలో చెత్తను తొలగిస్తున్న మండల ప్రత్యేకాధికారి మనోహర్



మామిడిపల్లిలో చెత్తను రిక్షాలో తరలిస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, ఏవో లక్ష్మీనారాయణ



బోయిలకింతాడలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

చోడవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చోడవరం శివారు రేవళ్లలో చెత్తాచెదారాన్ని తొలగించి, పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజుతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు రేవళ్ల నుంచి చోడవరం వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోఆర్‌డీ మహేష్, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.
మాకవరపాలెం: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మండల కాంప్లెక్స్ పరిసరాలను శనివారం శుభ్రం చేశారు. మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.
బుచ్చెయ్యపేట: రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది తమ కార్యాలయాల, పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తుప్పలు,డొంకలు, చెత్తాచెదారం తొలగించారు.ఐసీడీఎస్ పీవో పుష్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.
మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో ఉన్న చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. అంగన్‌వాడీ కారకర్త చంద్ర, ఆయా నూకరత్నం పాల్గున్నారు.
రోలుగుంట: మండలంలోని ఎం.కె.పట్నంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పలు శాఖల అధికారులతో కలసి ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి జి.మనోహర్ శనివారం నిర్వహించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న భవనాలు, ఇళ్ల మధ్య ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మట్ల రాజశేఖర్ పాల్గొన్నారు.
దేవరాపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మామిడిపల్లిలో స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ సత్యంతో పాటు డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణ గ్రామంలో వీధులను శుభ్రపరిచారు. చెత్తాచెదారాలను గ్రామానికి దూరంగా తరలించారు. ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్‌పాల్గొన్నారు. బోయిలకింతాడలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి చెత్తాచెదారాలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి చీపురు పట్టి చెత్తను ఊడ్చారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రోలుగుంట: మండలంలోని కుసర్లపూడిలో సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. బాణసంచా కాలుస్తూ, సారెతో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. గ్రామ సమీపంలో గల చెరువులో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోగులకు పాలు, రొట్టెల పంపిణీ

మాడుగుల: దివంగిత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు స్థానిక ఎమ్మెల్యే బంగారు సత్యనారాయణ మూర్తి ఘనంగా నివాళి అర్పించారు. వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించిన అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.



రోగులకు పాలు,రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అమిత్‌షా రాజీనామా చేయాలి



ఆందోళన చేస్తున్న కేవీపీఎస్ సభ్యులు

రోలుగుంట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కుల వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) సభ్యులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రోలుగుంటలో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండలశాఖ అధ్యక్షుడు కె.చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా...అంబేడ్కర్‌ని అవమానించడం సరికాదన్నారు.

అపూర్వ సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నాతవరం: స్థానిక హైస్కూల్‌లో 1999–2000 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. వివిధ రంగాల్లో దూర ప్రాంతాల్లో స్థిర పడిన వారంతా ఈ కార్యక్రమానికి తరలిరావడంతో హైస్కూల్ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. 25ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం హైస్కూల్ ఆవరణలో కలియతిరిగి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సత్కరించి, సహపంక్తి భోజనాలు చేశారు ఆటపాటలతో ఉత్సాహంగా కాలక్షేపం చేశారు. ప్రతి ఏటా ఇలాగే కలుసుకోవాలని సమావేశంలో తీర్మానించారు.

వైభవంగా తీర్థాలు

కె.కోటపాడు : మండలంలోని సూర్రెడ్డిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లో శనివారం గ్రామ దేవతల తీర్థమహోత్సవాలను వైభవంగా జరిపారు. సూర్రెడ్డి పాలెంలో దుర్గాలమ్మ, కె.సంతపాలెంలో నాగదుర్గాలమ్మ అమ్మవార్ల తీర్థాలను నిర్వహించారు. రెండు గ్రామాల్లో గల ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే పూజలు జరిపి, మొక్కులు చెల్లించుకున్నారు. రెండు గ్రామాల్లో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
మాడుగుల రూరల్ : కె.జె.పురంలో శనివారం సీతారాముల తీర్థాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా తోడపెద్దు సేవ, మహిళలకు ముగ్గుల పోటీలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి జనం రావడంతో కేజే పురం సందడిగా మారింది.